సాక్షి బాపట్ల

శనివారం । 2 । ఆగస్టు । 2025



స్మార్ట్ మీటర్లపై పోరాటం

కొల్లూరు : ప్రజలు విద్యుత్ స్మార్టు మీటర్లపై పోరాటం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి టి. కృష్ణమోహన్, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు వి. వెంకట్రామయ్య అన్నారు.



గోవాడలో విశేష పూజలు

అమృతలూరు(భట్టిప్రోలు): గోవాడలోని బాల కోటేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

భ్రమరాంబకు పసుపు కొమ్ములతో అలంకారం



పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం అమ్మ వారిని పసుపు కొమ్ములతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఉపాధిలో అవినీతి మస్టర్లు

- అద్దంకి, రేపల్లె, వేమూరు, బాపట్లలో అక్రమాలు
- పర్చూరు, చీరాలల్లోనూ పథకంలో అదే తీరు
- పాత పనులకు రికార్డుల సృష్టి
- కుప్పలు తెప్పలుగా ఫేక్ మస్టర్లు
- ఇప్పటికే కృష్ణా, సాగర్ కాలువలకు నీళ్లు
- పనుల తనిఖీ లేదు.. అక్రమం బయటకు రాదు
- వాటాల కోసం డ్వామా పీడీ వెంపర్లాట
- కనీసం పట్టించుకోని ఉన్నతాధికారులు
- చేసిన పనులు చూపితేనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బిల్లులు

ఉపాధి హామీ పనుల్లో తవ్వేకొద్దీ అవినీతి బయటకు వస్తోంది. కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు అక్రమ సొమ్ములో వాటాలు అందుతున్నాయనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పచ్చనేతలూ అందిన కాడికి మింగేస్తున్నారు. రూ.కోట్ల మేరకు ప్రజాధనం అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లిపోతోంది.



మస్టర్ల లోపాలపై కొప్పరపాడు గ్రామసభలో అవినీతిని బయటపెడుతున్న ఎస్‌ఆర్పీ(ఫైల్)



ఉపాధి మస్టర్‌లలో ఫేక్ జాబితా



మాజీ సర్పంచ్ బాలకృష్ణ ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బల్లికురవ మండలం మల్లాయిపాలెంకు చెందిన సర్వలత ముండ్లమూరు మండలంలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆమె ఉపాధి పనికి వెళుతున్నట్లు (జాబ్ కార్డు నంబరు 50136) మస్టర్ వేశారు. ఆమె ఖాతాకు డబ్బులు మళ్లించారు. ఇదే గ్రామానికి చెందిన మార్క్ రెండు సంవత్సరాలుగా చెన్నైలో ఉంటున్నా (జాబ్ కార్డు నంబరు 50192) ఉపాధి పని చేస్తున్నట్లు చూపిస్తున్నారు. దివ్యాంగురాలు నాగిపోగు సైదమ్మ, (జాబ్ కార్డు నంబర్ 040 653), అంగన్‌వాడీ టీచర్ సత్యవతి (జాబ్ కార్డు నంబర్ 040 566) వంటి సంబంధం లేని పేర్ల మీద మస్టర్లు వేస్తున్నారు. 80 సంవత్సరాల బండి జయమ్మ, (జాబ్‌కార్డ్ నంబర్ 040 431), దివ్యాంగుడు బండి నాగరాజు (జాబ్ కార్డ్ నంబర్ 50118)లు సైతం ఉపాధి పనులకు వెళుతున్నట్లు చూపారు. వారి పేరున డబ్బులు డ్రా చేస్తున్నారు. బ్యాంకు ఉద్యోగానికి కోచింగ్ తీసుకుంటున్న గాయత్రి (జాబ్‌కార్డు నంబర్ 50 131), సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మణికంఠ (జాబ్‌కార్డు నంబర్ 50 148), లాయర్ ప్రసాద్ (జాబ్‌కార్డు నంబర్ 040 369).. ఇలా చెప్పుకొంటూ పోతే జాబితా చాలా పెద్దగానే ఉంది.

సగానికిపైగా అవినీతే...

ఒక్క మల్లాయిపాలెం మాత్రమే కాదు... జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. ఈ గ్రామంలోనే 70 మందికి పైగా ఫేక్ మస్టర్లు వేస్తున్నట్లు మాజీ సర్పంచ్ అబ్బారెడ్డి బాలకృష్ణ ఉన్నతాధికారులకు స్వయంగా ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం. ఇదే మండలంలోని కొప్పరప్పాడు, వైదన, ఎస్‌ఎల్ గుడిపాడు, కూకట్లపల్లి, కొమ్మినేనివారి పాలెం, మల్లాయిపాలెం, వేమవరం గ్రామాల పరిధిలో రూ. 12 కోట్ల విలువచేసే 645 పనులు జరిగాయి. సగానికిపైగా అవినీతి జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొప్పరప్పాడు గ్రామసభలో అక్రమాలు వెలుగు చూడగా, మూడు రోజుల క్రితం జిల్లా సంయుక్త కలెక్టర్ నాగిరెడ్డి కొమ్మినేనివారిపాలెం, వైదన, ఎస్‌ఎల్ గుడిపాడుల్లో తనిఖీలు నిర్వహించారు. గత ప్రభుత్వంలో చేసిన కాలువ, చెరువు, కుంటల పూడికతీత పనులను కొత్తగా రికార్డు చేసి బిల్లులు స్వాహా చేసినట్లు ఆయన విచారణలో బయటపడింది. ఆగ్రహించిన సంయుక్త కలెక్టర్.. మండలంలో జరిగిన మొత్తం పనులపై నివేదిక ఇవ్వాలని తహసీల్దారును ఆదేశించారు. ఒక్క బల్లికురవ మండలమే కాదు అద్దంకి నియోజకవర్గంతోపాటు వేమూరు, రేపల్లె, బాపట్ల, చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోనూ అక్రమాలు జరిగాయి. కృష్ణా సాగునీటి కాలువలు ఉన్న రేపల్లె, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు సమాచారం.



పనులు పరిశీలించి ఏపీవో రమాదేవితో మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ నాగిరెడ్డి (ఫైల్)

అన్ని స్థాయిల వారికి వాటాలు

ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పీఆర్ ఏఈలు, ఏపీవో, డ్వామా జిల్లా అధికారి వరకూ అవినీతిలో వాటాలు తీసుకుంటున్నారు. స్థానిక పచ్చనేతకు కూడా వాటాలు వెళుతున్నాయి. ఫిర్యాదులు చేసినా డ్వామా జిల్లా అధికారి స్పందించడం లేదు. పైగా అక్రమాలను మరింతగా ప్రోత్సహిస్తున్నట్లు డ్వామా అధికార వర్గాల్లోనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేసిన పని మేరకు కొలతలు చూసి డబ్బులు ఇస్తే వాస్తవంగా పనిచేసిన కూలీలకు గిట్టుబాటు అవుతుంది. కానీ ఫేక్‌మస్టర్లకు డబ్బులు ఇస్తుండడంతో నిజంగా పనిచేసిన పేదలు నామమాత్రపు కూలీతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

పచ్చ నేతలకు ఇవ్వాల్సిందే...

వాస్తవానికి ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి కొత్త వారిని నియమించుకోవాలంటే గ్రామ పంచాయతీ తీర్మానం అవసరం. జిల్లాలోని చాలా పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌లు ఉండటంతో పచ్చ నేతలు ఒక్కొక్కరి వద్ద రూ. 2 లక్షలు తీసుకొని దందా చేస్తున్నారు. ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి సీనియర్ మేట్ల పేరుతో కొత్తవారిని నియమించుకున్నారు. ఈ మేరకు ఫేక్ మస్టర్ల డబ్బుల్లో సగం స్థానిక పచ్చ నేతకు ఫీల్డ్ అసిస్టెంట్లు చెల్లిస్తున్నారు. అక్రమాలు వెలుగుచూసినా.. ఉన్నతాధికారులు కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం రూ. లక్ష వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశముంది.

హైర్ బస్సు డ్రైవర్ల నిరసన

బస్సులు నిలిపివేసి నినాదాలు



చీరాల అర్బన్: ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ రిక్రూట్‌మెంట్‌లో హైర్ బస్సు డ్రైవర్లకు ప్రాధాన్యత ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం డిపోలోని హైర్ బస్సుల డ్రైవర్లు నిరసన తెలిపారు. హైర్ బస్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సులు నిలిపివేసి నిరసన చేపట్టారు. సీఐటీయూ కార్యదర్శి ఎం.వసంతరావు మాట్లాడుతూ చీరాల డిపోలో 40 హైర్ బస్సులు నడుస్తున్నాయని, వీటిని నమ్ముకొని 90 మంది డ్రైవర్లు గత 15 సంవత్సరాలుగా ఆన్‌కాల్ విధుల్లో కొనసాగుతున్నారన్నారు. ఇటీవల నిర్వహించిన ఆన్‌కాల్ రిక్రూట్‌మెంట్‌లో హైర్ బస్సుల డ్రైవర్ల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోకుండా కొత్త వ్యక్తులను ఎంపిక చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఇతర డిపోల్లో హైర్ బస్ డ్రైవర్లకు ప్రాధాన్యత ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే చీరాలలో మాత్రం అందుకు భిన్నంగా చేస్తున్నారన్నారు. సమస్య పరిష్కరించకుంటే సమ్మె చేస్తామన్నారు. డ్రైవర్ల మెరుపు సమ్మె కారణంగా బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

పశ్చిమ డెల్టాకు 6,830 క్యూసెక్కులు విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి శుక్రవారం 6,830 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 290 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ 1,725, తూర్పు కాలువ 688, పశ్చిమ కాలువ266, నిజాంపట్నం కాలువ 490, కొమ్మూరు కాలువకు 2,640 క్యూసెక్కులు విడుదల చేశారు. 1,89,625 క్యూసెక్కులు సముద్రంలోకి పంపుతున్నారు.

న్యూస్‌రీల్

5న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ పాలీసెట్‌- 2025 కన్వీనర్ విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 5న పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్‌లో సివిల్, ఈసీఈ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, సీఎస్ఈ బ్రాంచ్‌లలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకై నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్లకు అర్హులైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని, ఇతర వివరాలకు 83329 11155, 98660 09672 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫెడరిక్ హయ్యర్‌కు నివాళులు



భట్టిప్రోలు: ఆంధ్ర ఇవాంజలికల్ 184వ లూథరన్ సంఘ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం భట్టిప్రోలులోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పితామహుడైన ఫాదర్ జాన్ క్రిస్టియన్ ఫెడరిక్ హయ్యర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొని ఆరాధనలు చేశారు. లూథరన్ లోగో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అందరూ ప్రేమ విందులో పాల్గొన్నారు. కాపరి రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, యువత, పిల్లలు, సంఘస్తులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయుల ధర్నా

నరసరావుపేట ఈస్ట్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పల్నాడు జిల్లా చైర్మన్ ఎల్.వి.రామిరెడ్డి (ఎస్టీయూ), సెక్రటరీ జనర్ బి.సంపత్‌బాబు (ఏపీటీఎఫ్) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని ఉపాధ్యాయులు శనివారం స్టేషన్ రోడ్డులోని ధర్నా చౌక్ వద్దకు హాజరు కావాలని కోరారు. పీఆర్‌సీని అమలు చేయటంతో పాటు సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలను పరిష్కరించాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తొలగించాలన్నారు. 18 డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

లక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



తాడేపల్లి రూరల్ : గుంటూరు జిల్లా సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని లక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి వారి మంగళాశాసనాలతో ఉదయం 9 గంటలకు మహాలక్ష్మి, వీరలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ నిర్వహించామని, సాయంత్రం పద్మావతి అమ్మవారికి గులాబీ పుష్పాలతో సహస్రనామార్చన, ఊంజల్ సేవతో కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయని, భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ ఎంపికలు ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం జిల్లాస్థాయి ఎంపిక ప్రక్రియ ప్రారంభించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న జిల్లా నుంచి ఎంపికైన జాబితాను రాష్ట్ర కార్యాలయానికి పంపనున్నట్టు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా మూడు విధానాలను పాటించనున్నట్టు పేర్కొన్నారు. వీటిలో ఉపాధ్యాయుని వ్యక్తిగత దరఖాస్తు, ఐదుగురు సహ ఉపాధ్యాయుల ద్వారా సిఫారసు, లీప్ యాప్ ఆధారిత పనితీరు ఆధారంగా జిల్లా ఎంపికలు జరుగుతాయని వివరించారు.

9 నుంచి శంకర్‌విలాస్ బ్రిడ్జిపై

రాకపోకలు నిలిపివేత

- కూల్చివేత పనులు ప్రారంభం
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ, మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): శంకర్‌విలాస్ బ్రిడ్జిపై ఈ నెల 9 నుంచి రాకపోకలు పూర్తిగా నిలిపివేసి కూల్చివేత పనులు చేపడుతున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, అధికారులతో కలిసి నగరంలో అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు.

- ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణ పనుల్లో భాగంగా ప్రస్తుతం 2 పిల్లర్స్ కాంక్రీట్ పూర్తి అయ్యాయని, 9 నుంచి కూల్చివేత పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 135 స్ట్రక్చర్లు ఉండగా వాటిలో 74 మంది అంగీకారం తెలిపారని, వారికి నష్ట పరిహారం ఇచ్చి నిర్మాణాలు తొలగించామన్నారు.
- నందివెలుగు రోడ్‌లోని ఆర్‌ఓబీ పనులు 10 రోజుల క్రితమే ప్రారంభమయ్యాయని, 8 నెలల్లో పూర్తి చేసేలా చూస్తామన్నారు.
- మణిహోటల్ సెంటర్‌లో కల్వర్ట్ నిర్మాణం చేయాల్సినందున ఆర్ అండ్ బీ అధికారులు రెండు రోజుల్లో అంచనాలు సిద్ధం చేసి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు.
- ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్ 3 పనులకు 7న టెండర్లు ఓపెన్ అవుతాయని, అనంతరం పనులు వేగంగా జరిగేలా చూస్తామన్నారు.
- శారదాకాలనీ రోడ్, బ్రాడీపేట, నెహ్రూనగర్ రోడ్‌ల విస్తరణకు, ఎల్సీ నం.3 గేటు దగ్గర ఆర్‌ఓబీ పనులు ప్రారంభిస్తే ట్రాఫిక్ సమస్యలు రాకుండా ఆటో నగర్, అగతవరప్పాడులను కనెక్ట్ చేసేలా రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.
- పీవీకే నాయుడు మార్కెట్‌కు గతంలో చేసిన డిజైన్లు ఎవరికి నచ్చలేదు కనుక రివైజ్డ్ డిజైన్లను నిర్ణయించాలన్నారు.
- నల్లపాడు చెరువు, బొంగరాలబీడు కార్మిక శాఖ స్థలాలను నగరపాలక సంస్థకు కేటాయిస్తూ నిర్ణయం జరిగిందన్నారు. త్వరలో పూర్తి స్థాయి అనుమతులు వచ్చాక కార్యాచరణ చేపడతామన్నారు.
- అసంపూర్తిగా ఉన్న గోరంట్ల వాటర్ ట్యాంక్ నిర్మాణ కాంట్రాక్టర్‌ని తొలగించి, నూతన కాంట్రాక్టర్‌కు పనులు కేటాయించడానికి చర్యలు తీసుకుంటున్నామని, నగరంలో మరమ్మతులకు గురైన రిజర్వాయర్ల పనులకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు.
- శిథిలావస్థకు చేరిన బీఆర్ స్టేడియం రిజర్వాయర్ స్థానంలో రూ.2 కోట్లతో నిర్మాణానికి పనులు ప్రారంభం కానున్నాయన్నారు.
- రెడ్డిపాలెం రోడ్ విస్తరణ గతంలో మాస్టర్ ప్లాన్‌కి భిన్నంగా జరిగినందున, సరిచేయాల్సి ఉందని, 3 వంతెనల వద్ద వర్షం కురిసినప్పుడు నీరు నిలుస్తున్నందున, శాశ్వత పరిష్కారం కోసం సుమారు 2 వందల ఆక్రమణలు తొలగించి, వారికి పునరావాసం కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.
- శారదా కాలనీ రోడ్ విస్తరణలో ప్రభావిత 22 మంది భవన యజమానులకు రూ.50.22 లక్షల నష్ట పరిహార చెక్కులను అందించారు.

ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో వరద తగ్గుముఖం



అరవింద వారధి వద్ద తగ్గుముఖం పట్టిన వరద



ఆరేపల్లిలో ఎండుతున్న వరి నారుమడి


కొల్లూరు: కృష్ణా నదికి నీటి విడుదలను తగ్గిస్తుండటంతో వరద తగ్గుముఖం పట్టింది. ప్రకాశం బ్యారేజ్‌కు ఎగువ ప్రాజెక్టుల నుంచి వరద విడుదల తగ్గుతుండటంతో బ్యారేజ్ నుంచి సముద్రంలోకి వదిలే నీటి పరిమాణం సైతం తగ్గుతూ వస్తుంది. గురువారం 2.61 లక్షల క్యూసెక్కుల నీటిని బ్యారేజ్ నుంచి దిగువకు విడుదల చేసిన అధికారులు క్రమక్రమంగా ఎగువ నుంచి వచ్చి చేరే నీరు ఆధారంగా సముద్రంలోకి నీటి విడుదలను తగ్గించుకుంటూ వస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి కృష్ణా నదికి వరద నీటి విడుదల 1.90 లక్షల క్యూసెక్కులకు పడిపోయింది. వరద తగ్గుముఖం పట్టినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఎండుతున్న వరి నారుమడులు

నగరం: ఖరీఫ్ ఆరంభంలోనే రైతులు సాగు నీటి సమస్య ఎదుర్కొంటున్నారు. వరుణుడుపై భారం వేసి పోసిన నారును రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. తొలుత వర్షాల రాకతో నగరం, ఆరేపల్లి, సజ్జావారిపాలెం గ్రామాలలో వరి నారు మడులు పోశారు. తర్వాత వాతావరణంలో మార్పులతో మొలకలు వచ్చిన నారుమళ్లకు నీరు కరువైంది. గాలులు వీయడంతో వడబడుతున్నాయి. రైతులు ఇంజిన్ల సాయంతో నారు మడులకు నీరు అందిస్తున్నారు.

గుర్రపు డెక్క తొలగించకపోతే నిరాహార దీక్ష

వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



భట్టిప్రోలులో గుర్రపు డెక్క తొలగింపును పరిశీలిస్తున్న వరికూటి అశోక్‌బాబు

వేమూరు: భట్టిప్రోలు నుంచి రేపల్లె డ్రెయిన్ వరకు గుర్రపు డెక్క పూర్తిగా తొలగించకపోతే నిరాహార దీక్ష చేస్తానని వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజక వర్గం ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం అద్దేపల్లి వెళ్లే మురుగు కాలువల్లో ఇరిగేషన్ అధికారులు గుర్రపు డెక్క తొలగింపు పనులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువల్లో గుర్రపు డెక్క వల్ల మురుగు నీరు పారుదల కాక పోవడంతో అధిక వర్షాలు వల్ల గతేడాది 2,500 ఎకరాలు దెబ్బతినడం జరిగిందన్నారు. కనగాల ప్రాంతంలో పెరవలి, పెరవలిపాలెం గ్రామాలకు చెందిన 1,500 ఎకరాలు మునిగి పోవడం జరిగిందన్నారు. గత నెల్లో కురిసిన వర్షాల వల్ల వెద సాగు పూర్తిగా మునిగిపోవడం జరిగిందన్నారు. గత నెల 19న మురుగు కాలువల్లో దిగి ఇరిగేషన్ అధికారులు గుర్రపు డెక్క తొలగించాలని నిరసన వ్యక్తం చేయడం జరిగిందన్నారు. గురువారం మురుగు కాలువల్లో గుర్రపు డెక్క తొలగించాలని జల దీక్ష చేయడం జరిగిందన్నారు. ఇరిగేషన్ అధికారులు సక్రమంగా స్పందించకపోవడంతో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ధర్నా చేయడంతో ఇరిగేషన్ డీఈ వచ్చి మురుగు కాలువల్లో గుర్రపు డెక్క తొలగిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ధర్నా విరమించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పడమటి శ్రీనివాసరావు, నియోజక వర్గం రైతు విభాగం అధ్యక్షులు గోపాల రాము, సయ్యద్ సిరాజ్, పసుపులేటి శివరామ ప్రసాద్, జంగం వాసు, వేల్పూరి నాగేశ్వరరావు, వేల్పూరి చిన్నారి, సయ్యద్ నవీ, జల్లి జోషి కాంత్, కొతవరపు పద్మావతి, కొతవరపు శ్రీనివాసరావు, యన్నం సురేష్, దాసరి కిరణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన చేజర్ల



బాపట్ల: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి శుక్రవారంమర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేసిన తరువాత తొలిసారిగా ఆయన్ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఉన్నారు.

ఆగి ఉన్న ట్రక్కును ఢీకొన్న కారు

చీరాల: రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్ ట్రక్కును.. ఓ కారు వేగంగా వెనుక నుంచి ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం 216 జాతీయ రహదారిపై మన్నం ఆపార్టుమెంట్ వద్ద చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న శివనాగిరెడ్డి పెన్షన్ కోసం కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామం చిన్నగంజాం వచ్చారు. తిరిగి కారులో కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళుతున్నారు. ఈ క్రమంలో 216 జాతీయ రహదారిపై మన్నం అపార్టుమెంట్ వద్ద ఇసుక ట్రాక్టర్ ట్రక్కు టైరు పంచర్ కావడంతో రోడ్డు పక్కన నిలిపి ఉంచారు. చినగంజాం నుంచి బాపట్ల వైపు వెళుతున్న కారు వేగంగా ట్రాక్టర్ ట్రక్కును వెనుక నుంచి ఢీకొంది. కారులో ముందు కూర్చొన్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనంలో చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

భక్తులకు రాగి నాణేలు పంపిణీ

ఫిరంగిపురం: వేమవరం గ్రామంలోని కోటిలింగాల క్షేత్రంలో 40 అడుగుల లోతున నిర్మిస్తున్న పాతాళకాళీ విగ్రహ ప్రతిష్ఠ పీఠం కింద భక్తులచే రాగి నాణేలు శుక్రవారం వేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు రాగి నాణేలు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. వాటిని పీఠం కింద భాగంలో వేసే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ముందస్తు జాగ్రత్తలతో డెంగీ నివారణ

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి

సత్తెనపల్లి: ముందస్తు జాగ్రత్తలతో దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగీ, చికున్ గున్యా, మలేరియా, బోద , మెదడువాపు వ్యాధులను నివారించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి అన్నారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ తో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ దోమల నివారణ చర్యలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు దోమలు పుట్టకుండా అలాగే కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. మురుగునీరు



కొమెరపూడిలో గాబుల్లో నిల్వ నీటిని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి

ప్రవహించేటట్లు చర్యలు చేపట్టాల్సిందిగా పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావుకు సూచించారు. క్షేత్ర స్థాయిలో నీటి నిల్వలను పరిశీలించి సూచనలు చేశారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ దోమలను నివారించాలంటే నీటి నిల్వలు లేకుండా చేయాలన్నారు. వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించి ఆరబెట్టి మళ్లీ నీరు పట్టుకోవాలని, (ఫ్రైడే డ్రై డే పాటించాలని), పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలందరూ దోమ తెరలు వాడుకోవాలన్నారు. పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ పి గౌతమి ఆధ్వర్యంలో బావులలో, నీటి కుంటల్లో దోమ లార్వాలను తినే గంబుషియా చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కె. వెంకటేశ్వరరావు, సత్తెనపల్లి రూరల్ సబ్ యూనిట్ ఆఫీసర్ షేక్ సుభాన్ బేగ్, ఆరోగ్య విస్తరణాధికారి పిట్టల శ్రీనివాస రావు, ఆరోగ్య పర్యవేక్షకులు ఎండీ రెహమాన్, ఎమ్ఎల్‌హెచ్‌పీ వైశాలి, ఆరోగ్య కార్యకర్తలు పి.సారితేజ, జి నరసింహారావు, ఆశా కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయండి

సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య డిమాండ్

జె.పంగులూరు: స్మార్ట్ మీటర్లు వెంటనే రద్దు చేయాలని, విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య డిమాండ్ చేశారు. ప్రమాదకర స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పంగులూరు ప్రధాన కూడలిలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అప్పటి టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పార్టీలు కరెంటు చార్జీలపై బాదుడే, బాదుడు కార్యక్రమం చేసిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి ప్రజలను బాదుతున్నారన్నారు. సంవత్సర కాలంలో కరెంట్ బిల్లులు పెరిగిపోయి జనం గగ్గోలు పెడుతున్నా, కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచలేదంటూ మోసగిస్తోందన్నారు. ఆదాయం పెరగక, కరెంటు బిల్లులు కట్ట



పంగులూరులో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాలు అందిస్తున్న నాయకులు

లేక జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆదనపు లోడు పేరుతో డెవలప్‌మెంట్ చార్జీలు, వినియోగదారుల డిపాజిట్ల సాకుతో వేల రూపాయలు దొడ్డిదారిని వసూలు చేస్తూనే ఉన్నారన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ పాటికే ప్రభుత్వ కార్యాలయాల్లో, దుకాణాలలో స్మార్ట్ మీటర్లు బిగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాయిని వినోద్‌బాబు, తలపనేని రామారావు, ఆదుమ్ సాహేబ్, సుధాకర్, పి. ఏలియా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బాధలు పట్టవా ?



ఆర్‌డీఓ ఖాజావలికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు

గుంటూరు వెస్ట్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో విద్యనభ్యసిస్తున్న దళిత, బహుజన విద్యార్థులను కూటమి ప్రభుత్వం దారుణంగా అవమానిస్తుందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుంచి క్షేత్ర స్థాయిలో జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్స్‌ను సందర్శించామన్నారు. మంచినీరు అపరిశుభ్రంగా ఉందన్నారు. మరుగుదొడ్లు దుర్వాసనగా ఉన్నా పిల్లలు అలానే నెట్టుకొస్తున్నారన్నారు. అన్నంలో బొద్దింకలు వస్తున్నాయని తెలిపారు. రుచిశుచీ లేని ఆహారాన్ని పెట్టడానికి మనస్సు ఎలా వచ్చిందన్నారు. మెస్ బిల్లులు, కాస్మొటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలన్నారు. మౌలిక వసతులపై స్పందించకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టల్స్ కోసం ఖర్చు చేయడం లేదనే విషయాన్ని గుర్తించాలన్నారు. రానున్న రోజుల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకంలో రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు రవీంద్ర నాయుడు, గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గ అధ్యక్షులు అజయ్, సాజిద్, పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు గోపి, జిల్లా నాయకులు భాను, కిరణ్‌లు పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిబిరం

నాదెండ్ల: ఇర్లపాడు పీఎంశ్రీ కేంద్రియ విద్యాలయలో శుక్రవారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో తృతీయ సోపాన్ పరీక్ష శిబిరం 2025 అట్టహాసంగా ప్రారంభమైంది. తెలంగాణలోని 26 కేంద్రియ విద్యాలయాల నుంచి స్కౌట్స్ విద్యార్థులు హాజరయ్యారు. నాలుగు రోజులపాటు జరిగే శిబిరం తెలంగాణ విద్యార్థులతో కళకళలాడింది. ప్రిన్సిపల్ నీరజ్‌కుమార్ శ్రీవత్స, ఉపాధ్యాయులు ముందుగా ఘనస్వాగతం పలికారు. తొలిరోజు క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధి, స్నేహపూర్వక ప్రయాణం అంశాలపై కార్యక్రమం జరిగింది. ఉదయం 8.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం కాగా, సిబ్బంది క్యాంప్ కిట్లు అందించారు. అనంతరం స్కౌట్స్ పెట్రోల్స్, మార్చ్‌ఫాస్ట్, స్వాగత నృత్యం ఆకర్షించాయి. క్వార్టర్ మాస్టర్ ఎస్. విజయ్‌కుమార్, ఎల్‌వోసీ రమేష్‌బాబు నాయకత్వం, సమాజ సేవ, జీవిత నైపుణ్యాలను వివరించారు. ప్రావీణ్యత, బ్యాడ్జ్ పరీక్షలు, సమూహ కార్యకలాపాలు, వ్యక్తిత్వ నిర్మాణ వ్యాయామాలు క్యాంప్‌లో జరగనున్నాయి.

అట్రాసిటీ కేసులో జైలు శిక్ష

అద్దంకి: కొట్లాట, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నేరారోపణ చేసిన నిందితునిపై నేరం రుజువు కావడంతో అతనికి నాలుగు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 20 వేల జరిమానా విధిస్తూ ఒంగోలు కోర్టు న్యాయమూర్తి రాజా వెంకటాద్రి శుక్రవారం తీర్పు వెలువరించారు. సంతమాగులూరు మండలం తంగేడుమల్లి గ్రామానికి చెందిన ఊయ్యాల రాంబాబు అద్దంకికి చెందిన పల్లపు రమాదేవిని ప్రేమించి 2019లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు మగ పిల్లలున్నారు. ఈ క్రమంలో భార్య భర్తల మధ్య మనస్పర్థలు రావడంతో వారు విడివిడిగా ఉంటున్నారు. తరువాత పల్లపు రమాదేవి అద్దంకి మండలం తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన అట్లూరి నాగ సత్యనారాయణతో సహ జీవనం చేస్తూ, అద్దంకి పట్టణంలో మారుతి వైన్స్ వద్ద బడ్డీ కొట్టు పెట్టుకొని పెద్ద కుమారుడు ప్రదీప్‌ను తన వద్దనే ఉంచుకుని పోషిస్తోంది. ఈ క్రమంలో ఒక రోజు రమాదేవి.. నేను నిన్ను చదివించలేనని మీ నాన్న వద్ద కు పో అని పంపింది. దీంతో, ఫిర్యాది తన కుమారుడిని తీసుకొని తన భార్య ఉన్న బడ్డీకొట్టు వద్దకు వచ్చి ఆమెతో గొడవకు దిగాడు. ఈ క్రమంలో నిందితుడు సత్యనారాయణ కల్పించుకుని రాంబాబుపై చాకుతో దాడి చేసి గాయపరిచాడు. రాంబాబు స్థానిక సీహెచ్‌సీ అద్దంకిలో చేరి ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు ఈ ఘటనపై అప్పటి ఎస్సై సుబ్బరాజు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అప్పటి దర్శి డీఎస్పీ నాగరాజు ప్రత్యక్ష, భౌతిక సాక్ష్యాధారాలను సేకరించి అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితునికి నాలుగు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ ఒంగోలు కోర్టు న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్టు సీఐ తెలిపారు.

బీజామృతంతో విత్తనశుద్ధి చేస్తే తెగుళ్లు దూరం

నరసరావుపేట రూరల్: బీజామృతంతో విత్తన శుద్ధి చేసి విత్తడం వలన మొక్కలకు తెగుళ్ల నుంచి తట్టుకునే శక్తి పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అరుణకుమారి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న సమయంలో రైతులు వరి నారుమళ్లకు సిద్ధమవుతున్నారని తెలిపారు. మంచి విత్తనం నాటితే మంచి దిగుబడి వస్తుందని ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. విత్తనాలు నాటే ముందు విత్తన శుద్ధి చేసి నాటడం వలన మొక్కలకు తెగుళ్ల నుంచి తట్టుకునే శక్తి పెరుగుతుందని వివరించారు. రైతులకు బీజామృతంతో విత్తన శుద్ధి వలన కలిగే లాభాలను వివరించాలని తెలిపారు. వరి, కూరగాయలు, మిరపతోపాటు ఏ



మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

రకమైన విత్తనాలైనా సరే బీజామృతంతో విత్తన శుద్ధి చేస్తే అనేక రకాల ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. వ్యవసాయం చేసే రైతులు స్వయంగా విత్తన శుద్ధి చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్, ఎన్ఎఫ్ఏ నందకుమార్, సైదయ్య, మేరి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

మంగళగిరి : పోలీసులు క్రీడలలో రాణించడంతో కొత్తగా పవర్ లిఫ్టింగ్‌లో కోచింగ్ తీసుకునేందుకు క్యాంప్ ప్రారంభించడం సంతోషకరమని ఏపీ పోలీస్ స్పోర్ట్స్ ఆఫీసర్ అభిరామ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని గుంటూరు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిమ్‌లో పోలీస్ స్పోర్ట్స్ ఆఫీసర్స్ కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిరామ్‌రెడ్డి మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ కోచింగ్ తీసుకున్న పోలీసులు పవర్ లిఫ్టింగ్ పోటీలలో విజయం సాధిస్తారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, కార్యదర్శి షేక్ సంధాని, కోశాధికారి జి. వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యుడు కాసుల ఉదయ కిరణ్, క్రీడాకారులు నాగేశ్వరరావు, మస్తానవలి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ పురస్కార దరఖాస్తుల స్వీకరణకు గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఈనెల 8వ తేదీలోపు దరఖాస్తు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయులు దాఖలు చేసిన ప్రతిపాదనలను డివిజినల్ స్థాయిలో ఉప విద్యాశాఖాధికారి చైర్మన్‌గా నలుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ జిల్లాస్థాయి కమిటీకి ఈనెల 12వ తేదీలోపు విధిగా సమర్పించాలని ఆదేశించారు. జిల్లాస్థాయి కమిటీ ద్వారా ఉపాధ్యాయుల తుది జాబితాను రాష్ట్రస్థాయి కమిటీకి ఈనెల 16లోపు సమర్పించాల్సి ఉందని తెలిపారు. ఈనెల 8వ తేదీ తరువాత సమర్పించే దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబడవని స్పష్టం చేశారు.

హత్య కేసులో వ్యక్తికి యావజ్జీవ శిక్ష

గుంటూరు లీగల్: భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవ శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ రెండో అదనపు జిల్లా కోర్టు జడ్జి వై.నాగరాజా శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాలు.. అగతవరప్పాడుకు చెందిన తోట ఏడుకొండలు కుమార్తె శారద(26)ను అదే గ్రామానికి చెందిన గవిరిబోయిన శివశంకర్‌తో 2009 మే 6న వివాహం జరిపించారు. శివశంకర్, ఆర్మీలో పనిచేస్తున్నాడు. శివశంకర్ సెలవులో ఇంటికి వచ్చిన సమయంలో, అతడి కుటుంబ సభ్యుల ప్రభావంతో భార్య శారదపై అనుచిత ఆరోపణలు చేయడంతో వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదం పెద్దల మధ్య రాజీ కుదిరినా, ఆ తరువాత శారద తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. అప్పట్లో నెలకి శివశంకర్ రూ.3000 చెల్లించడానికి అంగీకరించగా, శారద రూ.6,000 అడిగిన నేపథ్యంలో ఘర్షణ చోటుచేసుకుంది. 2015 జూలై 26న శివశంకర్ తన భార్య శారదపై కత్తితో దాడి చేసి ఆమెను హత్య చేశాడు. ఘటనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మల్లేశ్వరి అనే మహిళ గాయపడింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో విచారించిన రెండవ అదనపు జిల్లా కోర్టు జడ్జి మొదటి నిందితుడు గవిరిబోయిన శివశంకర్‌ను యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.3వేలు జరిమానా విధించారు. రెండో నిందితురాలు గవిరిబోయిన సుబ్బమ్మ మృతి చెందడంతో కేసు ముగించారు.

రెండు లారీలు ఢీకొని డ్రైవర్లకు గాయాలు



వినుకొండ: వినుకొండ మండలం చీకటిగలపాలెం మోడల్ స్కూల్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మూడు లారీలు ఒకదానికొకటి ఢీకొనగా ఇద్దరు లారీ డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... తెల్లవారుజామున ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు మొదట ఢీకొన్నాయి. వాటిని వెనుక నుంచి వేగంగా వస్తున్న మరో లారీ ఢీకొనడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. ఈ ఘటనలో లారీల ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యాయి. స్థానికులు 108కి సమాచారం తెలపడంతో గాయపడిన ఇద్దరు డ్రైవర్లను ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రమాదానికి గురైన వాహనాలను సంఘటనా స్థలం నుంచి పక్కకు జరిపించారు. డ్రైవర్లను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసుకుని దార్యప్తు చేస్తున్నారు.

కేవలం రూపాయికే బీఎస్ఎన్ఎల్ సరికొత్త ఫ్రీడమ్

నరసరావుపేట: భారత్ సంచార్ నిగం లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) సరికొత్త ఫ్రీడం ప్లాన్, కేవలం రూ.1తో 30 రోజుల వ్యాలిడిటీ, అపరిమిత కాలింగ్, రోజుకు 2 జీబి డేటా, రోజుకు 100 మెసేజ్‌లు, ఉచిత సిమ్ కార్డు ఇవ్వబడుతుందని గుంటూరు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ శ్రీ సప్పరపు శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. ఎం.యన్.పి. వినియోగదారులకు కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని, కావున అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, సిమ్ కార్డు కావలసిన వారు దగ్గరలోని బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాన్ని సంప్రదించవలసినదిగా కోరారు.

పీఎంశ్రీ జేఎన్‌వీలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చిలకలూరిపేట టౌన్: మండలంలోని మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ (11వ తరగతి) ప్రవేశాలకు అవకాశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ నల్లూరి నరసింహారావు ప్రకటించారు. సైన్స్, కామర్స్ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు శుక్రవారం తెలిపారు. 2024-25లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇందుకు అర్హులు అన్నారు. అలాగే 01.06.2008 నుంచి 31.07.2017 మధ్య జన్మించిన వారే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతి మార్కులను ఆధారంగా ఎంపిక చేసుకుని సీట్లు కేటాయిస్తామని వివరించారు. ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని, వాటిని ఆన్‌లైన్ jnvpanadu admirrionr@mail.com నమోదు చేయడం గానీ లేదా ప్రత్యక్షంగా విద్యాలయానికి వచ్చి ఇవ్వవచ్చని ప్రిన్సిపల్ తెలిపారు.

కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు

రేపల్లె: 2024-25 విద్యా సంవత్సరంలో ప్రతిభ కనపరిచిన కాపు విద్యార్థులకు ఈ నెల 22న రేపల్లె పట్టణంలో జరిగే వార్షిక సమావేశంలో ప్రతిభా పురస్కారాలు అందించటం జరుగుతుందని కాపు సేవా సమితి నాయకులు కె.శివశంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో 500ల మార్కులుపైగా సాధించిన, ఇంటర్మీడియెట్, ఆపై చదువులలో 85 శాతం మార్కులు సాధించి ప్రస్తుత విద్యాసంవత్సరంలో చదువుకుంటున్న విద్యార్థులకు నగదు పురస్కారాలు అందిస్తామన్నారు. విద్యార్థులు తమ మార్కుల జాబితా, ఆధార్, పూర్తి వివరాలతో కాపు సేవా సమితికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 82478 94595 నంబరులో సంప్రదించాలన్నారు.

గుంటూరు ఆర్డీ సరెండర్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ, వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ)గా పనిచేస్తున్న డాక్టర్ కె.సుచిత్రను సరెండర్ చేస్తూ శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ కె.సుచిత్ర గత ఏడాది ఆగస్టు 1న బాధ్యతలు చేపట్టారు. విధుల్లో చేరినప్పటి నుంచి తరచూగా అనారోగ్య కారణంగా సెలవులు పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా ఫైల్స్ క్లియర్ చేసేందుకు నెలల తరబడి సమయం వెచ్చించాల్సి వస్తుందని, కోర్టు క్లియరెన్స్ ఫైల్స్ కోసం ఎక్కువ రోజులు వేచి ఉంచుతున్నారనే ఆరోపణలు ఆమెపై ఉన్నాయి. ఆర్డీ కార్యాలయ అధికారులు, సిబ్బంది రాష్ట్ర ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి ఆర్డీగా పనిచేస్తున్న సుచిత్రను మార్చాలని, ఆమె ఉంటే తాము విధులు చేయలేమని రెండు పర్యాయాలు ఫిర్యాదు చేశారు. డాక్టర్ సుచిత్ర కూడా ఆర్డీ కార్యాలయ సిబ్బంది తనపై దాడి చేస్తున్నారంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఫైల్స్‌పై సంతకాలు కోసం వెళ్లేందుకు ఆర్డీ కార్యాలయ సిబ్బంది, అధికారులు భయపడేవారు. గత పదిరోజులుగా సెలవులో ఉన్న ఆర్డి సుచిత్ర శుక్రవారం జాయిన్ అయ్యారు. అయితే రాష్ట్ర కార్యాలయం అధికారులు నేరుగా వచ్చి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆమెను సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంఈఓల నియామకాన్ని ఉపసంహరించుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: మండల విద్యాశాఖాధికారులుగా ప్రభుత్వ యాజమాన్యంలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను నియమిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని పీఆర్‌టీయూ, ఆపస్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో సీవీ రేణుకతో పాటు ఆర్జేడీ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణను కలిసిన ఆయా సంఘాల నాయకులు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎంఈవో-1 పోస్టుల్లో ప్రభుత్వ యాజమాన్యంలోని స్కూల్ అసిస్టెంట్లను నియమించారని, ప్రభుత్వ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసుకు అనుగుణంగా భర్తీ చేయాలని ఉపాధ్యాయ సంఘాల అనేక విధాలుగా విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ విద్యాశాఖాధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు. ఎంఈవో-1లుగా ప్రభుత్వ యాజమాన్యంలోని ఉపాధ్యాయులను నియమిస్తూ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులు విస్మరించడం ఆందోళన కలి



డీఈవో రేణుకకు వినతి పత్రం సమర్పిస్తున్న ఆపస్, పీఆర్టీయూ సంఘాల నాయకులు

గిస్తోందన్నారు. ఒకే డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులను కామన్ సీనియార్టీ ప్రాతిపదికన ఎంఈవోలుగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులను కలిసిన వారిలో ఏపీ ఉపాధ్యాయ సంఘ (ఆపస్) జిల్లా అధ్యక్షుడు బాలచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ పమిడి పద్మ, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జువ్వా జ్ఞానేశ్వరరావు ఉన్నారు.

మధ్యవర్తిత్వంపై ముగిసిన 40 గంటల శిక్షణ



మీడియేషన్ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ సయ్యద్ జియావుద్దీన్, న్యాయమూర్తులు

గుంటూరు లీగల్: సుప్రీం కోర్టు మీడియేషన్, కన్సలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ న్యూఢిల్లీ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు జిల్లాలో ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర హైకోర్టు ఎంపిక చేసిన ప్లాపస్ చైర్మన్‌లు, మెంబెర్స్‌కు మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ అధ్యక్షత వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, ఒకటో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.ఎ.ఎల్.సత్యవతి మాట్లాడుతూ 40 గంటల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసినందుకు అందరికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ప్లాపస్ చైర్మన్ జి.రజిని మాట్లాడుతూ శిక్షకులు మీడియేషన్‌పై అవగాహన కల్పించారని, ఓర్పు, నైపుణ్యంతో అన్ని అనుమానాలను నివృత్తి చేశారని కృతజ్ఞతలు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా చెన్నై నుంచి శిక్షణ కోసం నియమించిన న్యాయవాది, సీనియర్ ట్రైనర్ రత్నతార, న్యాయవాది, సీనియర్ ట్రైనర్ సత్యారావు, గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.ఎ.ఎల్. సత్యవతి, గురజాల పదో అదనపు జిల్లా జడ్జి జి.ప్రియదర్శిని సత్కరించారు.

ఐవీఎఫ్ సెంటర్లలో తనిఖీలు

గుంటూరు మెడికల్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సృష్టి ఐవీఎఫ్ సెంటర్ ఉదంతంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఐవీఎఫ్ సెంటర్లలో (సంతాన సాఫల్య కేంద్రాలు) వైద్య అధికారులు తనిఖీలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 27 సెంటర్లు ఉండగా, శుక్రవారం 17 సెంటర్లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు చేశారు. సెంటర్లలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలు, రికార్డులు పరిశీలించారు. వైద్య పరికరాలు, వైద్య సిబ్బంది వివరాలు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు స్వయంగా పరిశీలించారు. పలు సెంటర్లలో ఫీజుల వివరాలు తెలియజేసే బోర్డులు లేకపోవడంతో, వాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పలు రికార్డులు సక్రమంగా లేకుండా ఉండటంతో వాటిని కూడా సరైన పద్ధతిలో నిర్వహించాలని ఆదేశించారు. ఒక్కో బృందంలో నలుగురు చొప్పున ఐదు బృందాలుగా ఏర్పడి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, గైనకాలజిస్టులు, ఇతర వైద్య సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. శనివారం కూడా తనిఖీలు కొనసాగుతాయని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదని, ఫీజుల వివరాలు బోర్డులు ప్రదర్శించడం లేదని పలు చోట్ల గుర్తించామన్నారు. తక్షణమే వాటిని ఏర్పాటు చేయాలని ఆయా ఐవీఎఫ్ సెంటర్ల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.